ఎక్కడి మురుగు అక్కడే



ఓడీచెరువులోని మరువవీధిలో అతి కష్టం మీద రోడ్డు దాటుతున్న యువతి





కదిరి- హిందూపురం ప్రధాన రహదారిలో పారుతున్న మురుగునీరు, ఓడీచెరువులోని ప్రధాన రహదారి స్టేట్ బాంక్ ముందు పరిస్థితి ఇలా..

- పడకేసిన పారిశుధ్యం
- డ్రెయినేజీల నిర్వహణ అస్తవ్యస్తం
- రోగాలు ప్రబలుతున్నా పట్టని అధికారులు

ఓడీచెరువు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రెయినేజీల నిర్వహణ సరిగాలేక మురుగు ముందుకు సాగడం లేదు. ఆ మురికి కూపాలే దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలకు వ్యాధులు వ్యాపింపజేస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రం ఓడీచెరువులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చెత్తాచెదారాలతో డ్రెయినేజీలు నిండి.. మురుగు ఎక్కడికక్కడ రోడ్లపైకి వస్తోంది. ఇటీవల బీసీ కాలనీలో దోమల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలడంతో డీఎంహెచ్ఓ పర్యటించి.. పరిస్థితిపై ఆరా తీశారు. అయినా పారిశుధ్యంపై అధికారులు పెద్దగా దృష్టి సారించలేదు. ఇక మరువ వీధిలో చెత్తకుప్పలు తరలించకుండా అలానే ఉంచడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. రద్దీగా ఉండే కదిరి – హిందూపూర్ ప్రధాన రహదారిపైనే మురుగునీరు పారుతోంది. కొన్నిచోట్ల డ్రెయినేజీలపై మూతలు లేక.. రోడ్డు దాటే సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు అందులో పడి గాయపడుతున్న ఘటనలు ఉన్నాయి. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు, ఆరోగ్యసిబ్బంది స్పందించి పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?

పుట్టపర్తి అర్బన్: ఎనుములపల్లి, పుట్టపర్తి ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడా గుంతల్లో నీరు నిలుస్తోంది. ఓ వైపు మురుగునీరు.. మరోవైపు వర్షపునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీనికితోడు ఖాళీ స్థలాల్లో నీరునిలిచి మడుగును తలపిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా శుభ్రం చేసేవారు లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. ఎనుములపల్లి, పుట్టపర్తి వసతి గృహాల వద్ద మురుగు నీరు చాలా రోజుల నుంచి నిలిచిపోవడంతో విద్యార్థులు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.



ఎనుములపల్లి హాస్టల్ వెనుక నిలిచిన వర్షపు నీరు

చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న పీడీ నరసయ్య

తనకల్లు: చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. మండల కేంద్రంలో చౌడేశ్వరి వ్యవసాయ అనుబంధ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీసీ) వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించి తగిన విధంగా ప్రోత్సహించాలన్నారు. రైతులకు తీసుకున్న రుణాలను సకాలంలో రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఎల్‌హెచ్ రామమోహన్, సీఎంఎస్ వృత్తి సంస్థ ప్రతినిధి గోపినాథ్, ఏసీ రవీంద్ర, ఏపీఎం జయంతి, ఎఫ్‌పీఓ ఏపీఎం రమణప్ప, ఎల్‌సీ సీసీ మునెప్ప, చౌడేశ్వరి వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ అధ్యక్షురాలు తోట సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలుణ్ని ఢీకొన్న బైక్



అపస్మారకస్థితిలోకి వెళ్లిన నితిన్

ధర్మవరం రూరల్: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శనివారం లింగిశెట్టిపాలెం ఓబులేసు కుమారుడు నితిన్ అనే బాలుడిని ద్విచక్రవాహనం ఢీకొంది. బాలుడికి వాంతులై అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ‘జనగణనలో కుల గణన’ సభ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఈ నెల 29న ‘జనగణనలో కులగణన’ చేపట్టాలనే డిమాండ్‌తో సభ నిర్వహించనున్నారు. బీసీలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం సాయి ఆరామంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 143 వెనుకబడిన తరగతుల కులాలు ఉన్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల స్థానాలు గణనీయంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం జనాభా లెక్కల ప్రకారం కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సీట్లు కేటాయించి అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. బీసీల జపం చేసే కూటమి ప్రభుత్వం మాత్రం కులగణన చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. బీసీ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వెనుకబడిన తరగతుల (బీసీ) కులాల హక్కులను సాధించుకోవడానికి సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పది గంటలకు సాయి ఆరామంలో ‘జనగణనలో కులగణన’ సభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, హిందూపురం పార్లమెంట్ బీసీ సంఘం సభ్యులు చక్రధర్, నాయకులు పవన్, వినోద్, మహేంద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దసరా ఉత్సవాలకు విరాళం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి వలసల గంగమ్మ గుడి దసరా ఉత్సవాలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణికంఠనాయక్ రూ.10 వేల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఉత్సవ నిర్వాహకులైన వెంకటరమణ, రామాంజి, బాబు అంజికి శనివారం అందజేశారు.

రైతులకు అందుబాటులో చీనీ మొక్కలు

ధర్మవరం రూరల్: చిగిచెర్ల ఉద్యాన నర్సరీలో రైతులకు అందుబాటులో చీనీ మొక్కలు ఉంచినట్లు ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు 73823 86882 నంబరును సంప్రదించాలని సూచించారు.

గౌకనపల్లిలో వైద్య శిబిరం

ఎన్పీకుంట: గౌకనపల్లిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మహిళలకు, గర్భిణులు, బాలింతలకు, కిశోరబాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం వలన ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ బాలాజీనాయక్, సీహెచ్ఓ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఇర్ఫాన్‌బాషా, ఏఎన్ఎమ్ భాగ్యమ్మ, బీజేపీ నాయకులు సమీవుల్లా, ఇంతియాజ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి

నల్లమాడ: కురుమాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు నూరొద్దీన్ భార్య జి.ఫజులున్ (55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, సర్పంచ్ లింగమూర్తి, నాయకులు రెడ్డెప్ప, కె.రాజారెడ్డి, నరేష్‌కుమార్, కొండే రాజారెడ్డి, అశోక్‌రెడ్డి, శంకర, జయరాం నాయక్ శనివారం ఉదయం గ్రామానికి వెళ్లి ఫజులున్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

కదిరి టౌన్: బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పందుల అపహరణ

నల్లమాడ: మండల కేంద్రంలో కె.వెంకటయ్య అనే వ్యక్తికి చెందిన 10 పందులను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ మేరకు బాధితుడు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళపై దాడి

కదిరి టౌన్: పట్టణంలోని బంగారు లక్ష్మణ్ కాలనీకి చెందిన శ్రీనివాసులు, ఆశోక్‌కుమార్ శనివారం సాయంత్రం గొడవపడుతున్నారు. అదే సమయంలో పక్కన నిల్చుని షహీన అనే మహిళ చూస్తూ ఉంది. పాతకక్షల కారణంగా షహీనపై శ్రీనివాసులు భార్య, కుమారుడు,, కూతురుతో కలిసి దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. షహీన ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు కుటుంబంపై పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బత్తలపల్లి: రోగాల బారిన పడకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి సూచించారు. శనివారం కోడేకండ్ల గ్రామంలో పోషణ్ మా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ సరస్వతి మాట్లాడుతూ పోషణ్ మాకు సంబంధించి ఆయిల్, ఉప్పు, చక్కెర తక్కువగా వాడాలని, చిరుతిండ్లు, జంక్‌ఫుడ్ తగ్గిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని, తద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సఖి సెంటర్ ఉమాదేవి, పారా మెడికల్ జ్యోతి, హబ్ అంగన్‌వాడీ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్ ప్రారంభం

తనకల్లు: ఎర్రచెరువుపల్లిలో శనివారం బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్‌ను ప్రారంభించారు. అనంతపురం బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌తో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ బాలగంగాధర్‌రెడ్డి, డివిజనల్ ఇంజినీర్లు అబ్దుల్ బాసిత్, సుబ్రహ్మణ్యం, రవి కుమార్, లక్ష్మీనారాయణ, మేనేజర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం శివానగర్‌లో రాజ రాజేశ్వరిదేవిగా చౌడేశ్వరీదేవి



బత్తలపల్లిలో అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారి విగ్రహం



పుట్టపర్తిలో శాకంబరిదేవిగా దర్శనమిస్తున్న వాసవీమాత



కదిరిలో ఖాద్రీ ఆలయంలో శ్రీకృష్ణావతార అలంకారం



తాడిమర్రి మండలం దాడితోటలో మహాలక్ష్మీదేవిగా పెద్దమ్మ

లలితదేవీ.. కటాక్షించు తల్లీ..!

సాక్షి బృందం: దేవీ నవరాత్రులు శోభాయమానంగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాలు, ప్రత్యేక మంటపాలలో లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఇంకా పలు చోట్ల వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాలు సమర్పించారు.



అమడగూరులో మహలక్ష్మీదేవి అవతారంలో చౌడేశ్వరి మాత



పట్నంలో లలితాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరిదేవి



తలుపులలో వెంకటేశ్వరుని అలంకారంలో వాసవీ మాత

ఘనంగా దసరా వేడుకలు



నవదుర్గల వేషధారణలతో నాటిక ప్రదర్శన

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి లోని సంస్కృతి విద్యాసంస్థల్లో దసరా వేడుకలు ఘనంగా సాగాయి. విద్యార్థులు దుర్గా మాతల వేషధారణలో ఆకట్టుకున్నారు. రంగోలి, నృత్యాలు, స్కిట్‌లు, కథలు చెప్పడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉత్సాహం, స్నేహ భావం ఏర్పడుతాయన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హేమచంద్ర, పీఆర్ఓ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిశుభ్రంగా ఉంచాలి



నల్లమాడలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

నల్లమాడ: క్రమం తప్పకుండా ఇంటింటా చెత్త సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ శ్రీనివాసులు గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. మండల కేంద్రం నల్లమాడలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం ఆయన నల్లమాడలోని మూడు గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించి జీఎస్టీ, సిబ్బంది హాజరు, విధులపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన మండల కన్వీనర్



నల్లచెరువు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పుంగనూరు నియోజకవర్గంలోని ఎర్రాతివారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నల్లచెరువు మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.

హక్కులు, బాధ్యతలపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహులు

పుట్టపర్తి: పౌరులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నరసిహులు సూచించారు. ఆయన శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి బుక్కపట్నం మండలం మారాలలో సివిల్ రైట్స్‌దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పౌరులు తమ హక్కులు, బాధ్యతలు విధిగా తెలుసుకోవాలని, అప్పుడే ఏది మంచి, ఏది చెడు అనితెలుస్తుందన్నారు.

‘కియా’ సిబ్బందికి తప్పిన ప్రమాదం



రహదారిపై డివైడర్‌పైకి ఎక్కిన బస్సు

కనగానపల్లి: దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ‘కియా’ సిబ్బందికి ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ‘కియా’ పరిశ్రమలో పనిచేస్తున్న 25 మంది శనివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని అనంతపురానికి బస్సులో వెళ్తున్నారు. దాదులూరు సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్ ముందుకు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి వాహనంపై అదుపు కోల్పోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టిం డివైడర్‌పైకి ఎక్కి నిలబడిపోయింది. దీంతో ‘కియా’ ఉద్యోగులు సురక్షితంగా బయటపడ్డారు. ఒకవేళ బస్సు బోల్తా కట్టి ఉంటే పెనుప్రమాదమే జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం



విద్యార్థిని తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: ఫ్లోర్ బాల్‌లో ప్రతిభ కనబరిచి సింగపూర్‌లో జరిగే ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికైన పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలకు చెందిన బోయ రోహిణికి వాల్మీకి ఉద్యోగుల సంఘం సభ్యులు రూ.54,616 ఆర్థికసాయం అందించారు. ఇంటర్నేషనల్ గేమ్స్‌లో పాల్గొనడానికి దాదాపు రూ.2లక్షలు ఖర్చవుతుందని ఉపాధ్యాయులు తెలపగా.. నిరుపేద కుటుంబానికి చెందిన రోహిణికి తమవంతుగా సాయం అందించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఈశ్వరయ్య, బీకే ముత్యాలప్ప, జిల్లా కోశాధికారి రామకృష్ణ, ధర్మవరం వాల్మీకి ఉద్యోగుల నియోజకవర్గ అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి రామ్‌ప్రసాద్, రాజశేఖర్, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



లక్ష్మీదేవమ్మను పరామర్శిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు : కొండకమర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి తల్లి లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం హైదారాబాద్‌లో వారు ఉంటున్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి, ధైర్యం చెప్పి.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట



కలశం తీసుకొస్తున్న రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం పాతదేవరపల్లిలోని పురాతన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ గోపుర కలశ ప్రతిష్ట శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బంగారు చెన్నేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌టీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు గోపురానికి కలశం ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. తమ తాత అప్పన్నగారి చన్నరాయుడు జ్ఞాపకార్థం ఐదేళ్ల కిందట గోపురం నిర్మించామన్నారు. శుక్రవారం రాత్రి హోమం చేసి శనివారం గోపురంపై కలశం ప్రతిష్టించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, నారాయరెడ్డి, గోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సాయినాథ్‌రెడ్డి తదితరులతో పాటు అర్చకులు పాల్గొన్నారు.

3 నుంచి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు



సీతారామచంద్రస్వామి ఆలయం

బత్తలపల్లి: గంటాపురంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లు వెచ్చించి నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అక్టోబర్ 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శనివారం మీడియాకు వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఖుషీ లేని ‘దిల్‌కుష్’ రైతులు



నడిమిగడ్డపల్లి వద్ద విరగ్గాసిన ద్రాక్ష తోట

ధర్మవరం రూరల్: ధర లేక ద్రాక్ష రైతులు నష్టాలబారిన పడుతున్నారు. ధర్మవరం మండలంలోని దర్శనమల, నేలకోట, బిల్వంపల్లి, వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి గ్రామాల్లో 70 ఎకరాల్లో ‘దిల్‌కుష్’ రకం ద్రాక్ష సాగు చేశారు. అయితే ఈ ఏడాది ఆశించిన మేర ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా దక్కవని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.3.50 లక్షల దాకా పెట్టుబడి పెట్టామంటున్నారు. ప్రస్తుతం కిలో ద్రాక్ష ధర రూ.48కు మించడం లేదంటున్నారు. ఇక్కడ పండించిన పంటను ఒడిశా, కోల్‌కతాకు వ్యాపారులు తరలిస్తారన్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆరోగ్యంపై మహిళలకు అవగాహన

ముదిగుబ్బ: కొండగట్టుపల్లిలో శనివారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, సిబ్బంది రవి శంకర్, అలివేలమ్మ, జ్యోతి, భార్గవి, సుజాత, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టిద్దాం

నల్లచెరువు: గ్రామాల్లో చెత్త సేకరించి వాటి నుంచి తడి చెత్త- పొడి చెత్తను వేరు చేసి తద్వారా తయారు చేసిన ఎరువులతో సంపద సృష్టించుకోవాలని డీఎల్‌డీఓ వెంకటరత్నం సూచించారు. శనివారం మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. సంపద కేంద్రాల్లో ఘన పదార్థాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ పంచరత్నమ్మ, డీపీఆర్‌సీ సిబ్బంది విశ్వనాథరెడ్డి, సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు నరేష్ కుమార్, ఆంజనేయులు హరిత రాయబారులు తదితరులు పాల్గొన్నారు.